# మీరూ వున్నారెందుకూ?

"నువ్వూ ఉన్నా వెందుకూ?" అంటూ వచ్చి ఎదురుగా కుర్చీలో కూచుని తాపీగా సిగరెట్టు వెలిగించాడు సదాశివం.

సదాశివం కళలూ కథలూ సుపరిచితమే. ఆఫీసు కొచ్చి స్టోరీ సిట్టింగ్స్ పెట్టొద్దంటాను. వినడు. మా స్టాఫ్‌కి అలవాటై పోయింది. కాఫీ లొచ్చాయి. పి.ఎ. వెళ్ళిపోయాడు. సదాశివం వెళ్ళిపోయే దాకా కేబిన్‌లోకి ఎవరూ రారు, మామూలుగా.

"చాలా రోజుల కొచ్చావు గానీ.... సాయంత్రం.... ఇంటి దగ్గర.... పోనీ.... మీ ఇంటికి నేను..." అంటూ నసిగాను.

అపర నారదుడు మా సదాశివుడు. లౌక్యంగా పొగ వదుల్తూ గుండ్రంగా నవ్వాడు. "మామూలుగానే మనకి ఇళ్ళ దగ్గర సిట్టింగ్సూ, మూవ్‌మెంట్సూ పడవు కదా.... ఇది మరీ సెన్సేషనల్ సబ్జెక్టు.... యాంటీ ఫ్యామిలీ కూడా అనుకుంటా..."

"చెప్పెయ్ చంపక..."

"శంకరూ సరితా గొడవ పడ్డారు. అమ్మాయి పుట్టింటి కెళ్ళి పోయింది. సెపరేషన్ కేసను కుంటున్నారు!!" అన్నాడు సదాశివం.

"వ్వాట్?" ఆశ్చర్యపోయాను.

మా మిత్ర బృందంలో అతి చిన్నవాడు శంకర్. మహా బుద్ధిమంతుడు, మహా ఒద్దికైన వాడు, మహా ఓపిక గలవాడు.... అన్నీ మహాలే. ఈ మధ్యే పెళ్ళయింది. ఇంకా పిల్ల ల్లేరు. సరిత కూడా మహా గుణవతీ, సుమారుగా రూపవతీ, చాలా అనుకూలవతీ.... మొత్తానికి చాలా మంచమ్మాయి.

అది వరకు.... మిత్రులే లోకంగా తిరిగేవాడు శంకర్. పెళ్ళయ్యాక తగ్గించేశాడు. సహజమే. కాని మిత్ర బృందంలో అతనెప్పుడూ ఆత్మీయుడే.

వాళ్ళది అనుకూల దాంపత్య మనీ, చాలా అందమైన దాంపత్య మనీ,

ఒక రకంగా ఆదర్శ దాంపత్యం కూడా అనీ.... ఈ మధ్యే మిత్రులంతా సంతోష పడుతున్నారు. వాళ్ళ మధ్య గొడవ లంటే, అలక లంటే, విడిచి పెట్టి వెళ్ళడ మంటే....

"అదే మంత నమ్మేసే విషయం కాదు. నాకు తెలుసు. అయినా అది విని నేను షాకయి పోయాననుకో..." అంటూ సిగరెట్టు కొస తోనే మరో సిగరెట్టు వెలిగించు కున్నాడు సదాశివం.

"నాన్చొద్దు.... చెప్పెయ్యి.... షాకయి పోతాను..." అన్నాను బలి పశువు టోటుతో.

"అశ పాపం.... కథన్నాక ఓ బిగినింగ్ ఉండాలి... ఓ మిడిల్ ఉండాలి..." అంటూ సహజ ధోరణిలో సస్పెన్స్‌గా చెప్పాడు సదాశివం.

ఊక దంపుడుతో హైరా రెత్తించినా అతని మాటల్లో నిజాయితీ ఉంది. నారదుడన్న ట్రేడ్‌మార్క్ కీర్తి కొట్టేశాడు గానీ, మావాడు మరీ అంత కలహ భోజను డేమీ కాదు. అయినవీ కానివీ ఆసక్తిగా పరిశీలించడం, పరిశోధించడం.... మనవాడి హాబీ.

సరిత, శంకర్‌ల గురించి వాడు అన్నీ సరిగ్గా తెలిసే మాట్లాడు తున్నాడని వెంటనే అర్థమై పోయింది. పని గట్టుకుని ఎవరి మీదా అబద్ధాలు ప్రచారం చెయ్యడు. ఆ గ్యారంటీ మాత్రం ఉంది....

వాళ్ళది ప్రేమ వివాహం కాదు. అలాగని మరీ పెద్దలు చేసిన గంగిరెద్దు పెళ్ళీ కాదు.

బంధు వర్గం లోనే.... ఇద్దరూ బాగా ఆలోచించుకుని, ఎంపిక చేసుకుని, పెద్దలు కూడా బాగా ఇష్ట పడడంతో.... పెళ్ళి చేసుకున్నారు.

కట్న కానుకలు, లాంఛనాలు, మర్యాదలు.... వీటిలో ఏ లోపాలూ జరగ లేదు. కోప తాపాలూ లేవు.

డబ్బు కారణంగా వాళ్ళ మధ్య గొడవ లొచ్చే అవకాశాలు లేవు. ఇక మనస్తత్వాలు కలవడం, ఇద్దరూ సరదాగా, సజావుగా ఉండడం అంటే... అవన్నీ ఎవరికి వారు పడి లేవ వలసిందే...

కాని కొత్త కాపురం మొదలైన కొద్ది రోజులకే సరితకు ఏదో అసంతృప్తి మొదలైంది.

అది.... హైరా దా గురించి.

శంకర్ మామూలు మనిషి. కలెక్టరో, డాక్టరో, ఇంజనీరో, రాజకీయ నాయకుడో కాదు. మందిలో మందలో పలుకుబడి లేదు. ప్రత్యేక గుర్తింపు లేదు. సాదా సీదా ఉద్యోగి. ఫలానా కంపెనీలో... అసిస్టెంట్ మేనేజర్.... అంతే! ఎదుగూ బొదుగూ ఉండదు. చెప్పుకున్నా ఎవరికీ తెలీదు.

పెళ్ళికి ముందు సరిత ఈ విషయం పెద్దగా పట్టించు కోలేదు. అబ్బాయి బావున్నాడు. మంచివాడనే పేరుంది. మంచి ఉద్యోగం. మంచి కుటుంబం. ఇంకేం కావాలి? అయితే...పెళ్ళయి కాగానే.... ఇతరుల పలకరింపుల్లో పరామర్శల్లో.... ఏదో లోటూ వెలితీ ఉందని పించింది. ఉద్యోగం.... ఓస్.... ఇంతేనా...?

ఇంతే ఉండ నవసరం లేదు. చాలా జీవితాలు ఇలాగే మొద లవుతాయి. ముఖ్యంగా మగ వాళ్ళు జీవితంలో సులభంగా రాజీ పడిపోరు. ఏదో సాధిస్తారు. పేరు తెచ్చు కుంటారు.

పేరు తెచ్చుకుంటే ఏమిటా? ఫలానా శంకరం భార్య అంటే చాలదూ? ఎంత గొప్పగా ఉంటుంది!?

ఉద్యోగంలో ప్రతిభ చూపించి పైపైకి ఎదిగే వాళ్ళు ఎంత మంది లేరు! తాత్కాలికంగా ఉద్యోగాలు చేసినా, ఆ తర్వాత స్వంతంగా వ్యాపారాలు చేసి కోట్లకి పడగెత్తే వాళ్ళు ఎంత మంది!

శంకర్‌లో కూడా ఈ గుణాలు ఉంటా యనే సరిత అనుకుంది. ఆ మాత్రం బాగు పడే లక్షణా లున్నా చాలు. తను అతన్ని కంటికి రెప్పలా చూసుకుంటూ... పెద్ద వాడయ్యేలా చేస్తుంది. పురుషుడి విజయం వెనుక ఉండే స్త్రీ కెంత తృప్తి!

“ఉద్యోగంలో నాలుగు రాళ్ళు వెనకేసు కున్నాక... అంతటితో సరిపెట్టుకో కూడదు మనం.... ఎవరి దగ్గరైనా ఫైనాన్స్ రాబట్టే అవకాశం ఉంటే చూడండి... ఏదైనా మంచి బిజినెస్ పెట్టుకో వచ్చు...” అని చెప్పి చూసింది గానీ గురుడు ఏ మాత్రం పట్టించుకో లేదు.

“సరితా... ఎందు కొచ్చిన బిజినెస్‌లు... లేని తల నొప్పులు... పరిగెత్తి పాలు తాగడం కన్నా, నిలబడి నీళ్ళు తాగడం బెస్ట్ కదా? నా తత్వానికి సరి పడని ఆశలు... నువ్వూ పెంచుకో వద్దు...” అని విదురుడిలా నీతి బోధ చేశాడు శంకర్.

సరిత ఆశలు కుప్ప కూలి పోయాయి. గొర్రె తోక గుర్తొచ్చింది. ఇంతేనా?

జానెడు ఉద్యోగం. మూరెడు సంపాదన. బారెడు ఆశలు ఎలా తీరుతాయి?

ఎన్ని రకాలు గానో చెప్పింది. లాభం లేదు. "మరీ అంత డబ్బు పిచ్చా నీకు?" అని విసుక్కున్నాడు.

సరిత కూడా ఆత్మ విమర్శ చేసుకుంది. డబ్బు పిచ్చేనా? కాదు. డబ్బు అందరికీ కావాలి. తనకూ కావాలి. సుఖం అందరికీ కావాలి. పోనీ...తనకు వద్దను కుంటే? డబ్బూ, సుఖం...అవసరం లేని మనుష లెవరు?వాళ్ళు మాత్రం దేని కోసం బ్రతుకుతారు?

ఏదో పని చెయ్యాలి. మనిషై పుట్టి నందుకు... తనుగా ఏదో చెయ్యాలి. గంగిరెద్దు కాదు. గానుగెద్దు కాదు. మనిషి!! సరిగ్గా... అటువంటి తరుణంలో వాళ్ళింటి ఎదురింట్లో గిన్నిస్ చిన్నయ్య దిగడంతో కథ కొత్త మలుపు తిరిగింది.

చిన్నయ్య ఇంటి పేరు గిన్నిస్ కాదు.

గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాలని అతని తపన. అది అందరి నోటా పడింది. ముద్దు పేరులా ముందొచ్చి నిలిచింది.... గిన్నిస్ చిన్నయ్య!

ఐదా రేళ్ళుగా ఏవేవో చేస్తున్నాడు చిన్నయ్య. ఏదో కంపెనీ రిప్రజెంటెటివ్. చిన్న సంపాదన. చిన్న కుటుంబం. చింతలు లేని కుటుంబం.

హఠాత్తుగా వార్తల కెక్కు తుంటాడు చిన్నయ్య. ఎప్పుడో ఏదో అయిడియా వస్తుంది. పట్టుబట్టి ఏదో 'ఫీట్' చేసేస్తాడు. 'ఫీట్' తో బాటు అతని ఫోటో ప్రముఖంగా పేపర్లలో వస్తుంది.

ఇది వరకు వాళ్ళున్న కాలనీలో రకరకాల ఫీట్లు, వింత పనులు చేశాడు.

మొట్ట మొదట.... మూడు సంవత్సరాల పాటు కుడి చేతి గోళ్ళు కట్ చేయకుండా పెంచేశాడు. వాటికి ముద్దుగా రంగులు వేసి ప్రదర్శిస్తూ.... అందర్నీ ఆకట్టు కున్నాడు. తర్వాత... మూడు రోజుల పాటు చౌరస్తాలో గడియారం స్తంభం పైనే కూచుండి పోయి... రికార్డు స్థాపించాడు. అంత ఎత్తు నుంచి అలా జన ప్రవాహాన్ని చూస్తూ గడిపితే అదో థ్రిల్ కలిగిం దన్నాడు.

ఒకసారి.... వాళ్ళ అపార్ట్‌మెంట్‌లో అయిదు అంతస్థుల మెట్లు.... మొత్తం వెయ్యిన్నీ మూడు వందల ఇరవై ఆరు మెట్లు.... ఎక్కుతూ దిగుతూ నాలుగు రోజుల పాటు గడిపేశాడు. ఆ 'ఫీట్' కృషికి పట్టుదలకు నిదర్శన మన్నాడు.

ఇంకో శుభ సందర్భంలో... అపార్ట్‌మెంట్ రూఫ్‌మీద.... పిట్టగోడ ఎక్కేసి... బ్యాలెన్స్ చేసుకుంటూ.... నలభై ఎనిమిది గంటల పాటు అలా

నడుస్తూ ఉండి పోయాడు. పడితే చచ్చిపోయేవాడే! ఆ ఫీట్‌ని మాత్రం పత్రిక లన్నీ చాలా బాగా కవర్ చేశాయి.

"రికార్డ్లు స్థాపించా లంటే అందరూ ఎవరెస్ట్ నే ఎక్క నవసరం లేదు. ఇంగ్లీష్ ఛానల్‌ని ఈదక్కర్లేదు. అంతరిక్షం దాకా వెళ్ళ నవసరం లేదు. ఏ శిక్షణా అవసరం లేదు. నిత్య జీవితంలో మామూలుగా కనిపించే పనులనే ఎక్కువ కాలం... విరామం లేకుండా చేసి... రికార్డు స్థాపించ వచ్చు. అయితే... దీనికి మంచి ఐడియా రావడమే మొదటి విజయం. దాన్ని ఖచ్చితంగా అమలుచేస్తే.... అదే రికార్డు. దీని వల్ల మనుషుల్లో దీక్ష, దక్షతలు పెరుగుతాయి..." అంటూ తన సందేశం కూడా ఇచ్చాడు చిన్నయ్య.

"ఏదైనా అరుదైన ఫీట్ చేసి... ప్రపంచ రికార్డు స్థాపించి... గిన్నిస్ బుక్ లోకి ఎక్కా లనేదే నా జీవితాశయం..." అని చెప్పుకున్నాడు గిన్నిస్ చిన్నయ్య.

ఎదురింట్లో గిన్నిస్ చిన్నయ్య దిగాడని తెలియడంతో సరిత బోలెడు సంబర పడి, శంకర్‌ని బలవంత పెట్టి వాళ్ళింటికి విజిట్ వెళ్ళడానికి ఒప్పించింది.

ఆ సరికే చాలా మంది అభిమానులు పోగయ్యారు.

చిన్నయ్యా, అతని భార్యా... విజిటర్స్‌ని చాలా బాగా రిసీవ్ చేసు కున్నారు. వాళ్ళలో అతిశయం, గర్వం దాగడం లేదు. ఫోటో ఆల్బం, పేపర్ కటింగ్స్ చూపెట్టారు. ప్రముఖులతో దిగిన ఫోటోలు.... ఏదో స్కూల్ ఫంక్షన్‌కి చిన్నయ్య చీఫ్‌గెస్ట్‌గా కూడా వెళ్ళాట్ట!

"ఈ విజయా లన్నిటికీ కారణం మా ఆవిడే! ఏ నాటి కైనా.... గిన్నిస్ బుక్‌లో కెక్కుతాను.... మన ఊరికి పేరు తెస్తాను... నన్నింతటి వాణ్ణి చేస్తున్న మా ఆవిడ గొప్పతన మేమిటో ఆనాడే లోకానికి తెలుస్తుంది..." అన్నాడు చిన్నయ్య. అందరూ ఆనందంగా చప్పట్లు కొట్టారు. ముఖ్యంగా ఆడవాళ్ళు చిన్నయ్య భార్యని అభినందనలతో ముంచెత్తారు.

వాళ్ళింటి నుంచి వచ్చేస్తూ.... మొట్ట మొదటి సారిగా శంకర్‌ని ఈసడించే ధోరణిలో.... సాగ దీసింది సరిత... "మీరూ ఉన్నారెందుకూ??.."

"ఆc...! ఉన్నాను! ఎందుకేంటి? చిన్నదో చితకదో... ఉద్యోగం చేస్తున్నాను.... ఇష్ట పడి పెళ్ళి చేసు కున్నాను. భార్యని పోషిస్తున్నాను. ఎవర్నీ మోసం చెయ్యడం లేదు. ఎవర్నీ యాచించడం లేదు. ఇంకేం కావాలి?" అని అడిగాడు శంకర్.

"జీవితాంతం ఇలాగే ఉండిపోవాలా? ఇంతేనా లైఫ్ అంటే?!" అంది సరిత.

"సరితా! నువ్వు ఊహల్లో ఉన్నావు. నిజ జీవితంలో లక్షలాది కోట్లాది ప్రజలు ఏ ప్రత్యేకతా లేని సగటు జీవులు. అందరూ కూడా ఆర్టిస్టులూ, గాయకులూ, నాయకులూ, ఆ మాట కొస్తే గూండా లైనా.... కాలేరు. ఒక్కో ప్రత్యేక మైన పనికీ ఒక్కో టాలెంట్ కావాలి. నాకు ఏ టాలెంటూ లేదు.

జస్ట్.... సగటు మనిషిని!.... అంతే. ఈ జీవితంలో నాకు తృప్తి ఉంది. నన్ను ప్రేమించే వ్యక్తిగా.... ఈ జీవితాన్ని ఇష్ట పడడం నేర్చుకుంటే నీకూ తృప్తి ఉంటుంది...." అన్నాడు శంకర్.

"మీ లెక్చె రంతా నాకు అర్థమైంది. ఆస్తీ అంతస్తూ డబ్బు సుఖమూ.... వీటి సంగతి వద్దు. పోనివ్వండి.... నేను డబ్బు మనిషిని కానని నాకు ఖచ్చితంగా తెలుసు. నేను చెప్పేది స్పిరిట్ సంగతి. జీవితంలో ఏదో ఒక పని కొత్తగా ప్రత్యేకంగా చెయ్యాలనీ నలుగుర్నీ ఆకట్టు కోవాలనీ ఉండదా మీకు? మగవా డంటే అలాంటి పనులు చేయాలి..."

"నలుగురు చూస్తుండగా నడి రోడ్డులో.... కాలు జారి పడగల నేమో!... అదీ ఆకట్టు కోవడమేనా?"

"అక్కడే ఉంది కిటుకు! గిన్నిస్ చిన్నయ్యని చూడండి! ఏం సంపాదించా లని ఆ తాపత్రయం? ఎంత పట్టుదల! ఎంత దీక్ష!.... అత నింటికి అభిమానులు ఎలా ఎగబడి వస్తున్నారో చూడలేదూ? ముందసలు.... ఆత్మ తృప్తి కోసమైనా... ఒరిజినల్‌గా ఏదైనా చెయ్యా లని మీ కెందుకు అనిపించదూ?"

"నన్నిలా వేధించే బదులు.... అటువంటి పనేదో నువ్వే చెయ్యొచ్చుగా?"

"ఇది ఇండియా.... స్త్రీ పురుషుడి వెనక ఉంటేనే అందం..." అంది సరిత.

"కాస్త సైలెంట్‌గా ఉంటే మరీ అందం..."

వీళ్ళిలా మాట్లాడు కుంటూ ఉండగా వీధిలో కలకలం వినిపించింది. బిగ్గరగా ఆడ వాళ్ళ మాటలు. పరుగులు. నవ్వులు, ఏవో పాత్రల చప్పుడు.

కాస్సేపటికే మరో సెన్సేషనల్ న్యూస్.... వెల్లడైంది.

గిన్నిస్ చిన్నయ్య.... మరో కొత్త రికార్డుకి శ్రీకారం చుట్టాడు. కాలనీలో.... మా వీధి చివరున్న బోరింగ్ దగ్గర.... తిష్ఠ వేశాడు.

మూడు రోజుల పాటు వరసగా బోరింగ్ కొడుతూ ఉండి పోతా డట.

ఇంకెవర్నీ కొట్టనివ్వ డట!

కాలనీలో వాళ్ళే కాదు.... ఇండియాలో ఎవరైనా సరే (మరీ బడాయి కదూ?) ఆ బోరింగ్ దగ్గర కొచ్చి నీళ్ళు పట్టుకు పోవచ్చు నట.

నిర్విరామ బోరింగ్ కొట్టుడు రికార్డు!

నిమిషాల్లో ఈ వార్త కాలనీ అంతా పాకిపోయింది.

అయ్యో పాపం అని కూడా చూడకుండా ఆడవాళ్ళు బిందెలూ, పాత్రలూ, డ్రమ్ములూ.... అన్నీ తీసుకెళ్ళి బోరింగ్ దగ్గర క్యూలో పెట్టేశారు.

బోరింగ్ కొట్టుడు ఆగిపోతే.... చిన్నయ్య రికార్డు కుదర్దుకదా? అందుకని బిందెలు తెచ్చి పెడుతూనే ఉన్నారు ప్రజలు.

శంకర్ ఇంట్లోనే బోర్ ఉంది. మోటర్ వుంది. నీళ్ల సమస్య లేనేలేదు. "అయినా....మనమూ ఓ బిందె తెచ్చుకుందామండీ....చిన్నయ్యను పరామర్శించినట్టూ వుంటుంది." అంది సరిత.

శంకర్ అడ్డు చెప్పేంతలో.... ఇరుగింటి పొరుగింటి సోదరీమణులు బిందెలతో బయలుదేరారు. సరిత కూడా వాళ్ళతో వెళ్ళిపోయింది.

హతాశుడై కూలబడిపోయాడు శంకర్.

బిందెడు నీళ్ళతో తిరిగొచ్చిన సరిత బోలెడు సంబరపడిపోతోంది...

"బోరింగ్ దగ్గర బోల్డు జనమండీ.... పేపర్‌వాళ్ళొచ్చేశారు. ఫోటోలు తీస్తున్నారు. రేప్పొద్దున టీవీ వాళ్లు కూడా వస్తారట.... మీరూ వున్నారెందుకూ?"

చిన్నయ్య దెబ్బతో మూడు రోజులూ కాలనీ అంతా మోగిపోయింది. బోరింగ్ మోత!

రాత్రింబవళ్ళూ అలా బోరింగ్ కొడుతూనే గడిపేశాడు చిన్నయ్య. అన్ని పేపర్లలో ఆ వార్త ఫోటోలతో సహా వచ్చేసింది.

లోకల్ కేబుల్ టీవీ లో కూడా చిన్నయ్య బోరింగ్ కొట్టుడు కార్యక్రమాన్ని ప్రసారం చేశారు.

కాలనీ యువజన సంఘం వాళ్ళు అర్జెంటుగా హంగామా చేసేసి రంగంలోకి దిగేశారు. చందాలు గుంజేశారు. బోరింగ్ దగ్గర చిన్న షామియానా, ఫ్లడ్‌లైట్లు పెట్టేశారు. షామియానాలో చిన్నయ్య పాత రికార్డుల ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు.

మైక్‌సెట్‌లో పాటల గోల. టక్కూ టక్కూమంటూ చిన్నయ్య బోరింగ్ కొట్టుడు.... తొలిరోజు సాయంత్రానికి తిర్నాలగా మారిపోయింది.

మూడోరోజు.... ముగింపు వేళకి బ్రహ్మాండమైన జనసముద్రం. స్థానిక ఎమ్మెల్యే వచ్చి చిన్నయ్యకు దండవేసి పుష్పగుచ్ఛం ఇచ్చి.... సత్కారం చేశాడు.

"తీవ్రంగా ఉన్న మంచి నీటి సమస్య తీర్చడానికి.... ప్రతి వాళ్ళూ శ్రమ దానం చెయ్యా లనేదే....నా సందేశం...." అన్నాడు చిన్నయ్య.

చిన్నయ్యకు అంతర్జాతీయ ఖ్యాతి రావాలని ఎమ్మెల్యే, మునిసిపల్ కమీషనర్.... ఆశాభావం వ్యక్తం చేశారు. కాలనీ యువజనులు చిన్నయ్యను భుజాల మీద మోసేస్తూ ఇంటి దాకా తీసు కొచ్చి వదిలారు.

అదంతా చూసిన సరిత.... శంకర్‌ని యథా ప్రకారం ఆ మాటే అన బోయింది. అతనే అందుకున్నాడు...."నేనూ ఉన్నాను ఎందుకూ?...అదే ఆలోచిస్తున్నాను...."

"ఆలోచించా ల్సిందే....ఏం లాభం? మీరేం చెయ్య గలరు? జస్ట్ వేస్ట్...!"

"ఆ మాట అనొద్దు.... తర్వాత బాధపడతావ్...!" అన్నాడు.

"నో!... మీరు సంతోష పెట్టలేరూ.... బాధ పెట్టనూ లేరు" చిల్లగింపుగా నవ్వింది.

"చూస్తావా?"

"చూస్తూనే ఉంటాగా..."

ఆ తర్వాత జరిగిన సంఘటనలు, సన్నివేశాలు క్రోడీక రించడం అంత సులభం కాదు. ఆలుమగలు, కాపురం, దాంపత్యం, ఇల్లు. ఇవన్నీ మాటలకు అందని వ్యవస్థలు. సొంత వ్యక్తుల అవస్థలు.

నిప్పూ పొగా సామెతలు కూడా చొచ్చుకు వెళ్ళ లేని సందర్భాలు ఉంటాయి. అయినా నమ్మకంగా తెలిసిన నిజాలూ కొన్ని ఉన్నాయి.

పాల వాడు, పోస్ట్‌మాన్, పని మనిషి, పేపర్ వాడు, పొరుగిం టావిడ.... అడపా దడపా విజిటర్లు....

ఇల్లన్నాక ఎందరో వస్తూ పోతూ ఉంటారు కదా?

అందరూ కలుసుకుని మాట్లాడుకో లేదు గానీ.... మామూలు కన్నా భిన్నంగా ఉంటే... తెలీదా ఏమిటి?

రెండు రోజుల పాటు ఆ ఇంటి మనుషులు బైటికే రాలేదు. పని మనిషి వస్తే.... వెళ్ళిపో మ్మన్నారు. పాలవా డొస్తే ప్యాకెట్టు లోపల వేసెయ్య మన్నారు.

పోస్ట్‌మాన్... రిజిస్ట్రేషన్ ఆర్టికల్ ఏదో తెస్తే.... శంకర్ లుంగీతో

వచ్చి.... తీసుకుని వెళ్ళి పోయాడు.... లోకం పైనుంచి చూస్తుంది. అంతే కదా?

మూడో రోజు ఉదయం.... మెల్ల మెల్లగా తెలిసింది కొందరికి.... శంకర్ హాస్పిటల్ లో చేరినట్టు!

ఏమైంది? ఏమో.... ఎవరూ సరిగ్గా.... తెలిసినట్టు చెప్పడం లేదు. గుసగుసగా మాట్లాడు కుంటున్నారు.

ఒంట్లో బావులేదు. అంతే. ఇరుగింటి పొరుగింటి ఆడవాళ్ళతో సరిత సరిగ్గా మాట్లాడ లేదు. హాస్పిటల్‌లో.... వంచిన తల ఎత్తకుండా.... బిగబట్టి.... ఏడుపు ఆపుకుంటూ....

డాక్టర్లకి ఏం చెప్పుకున్నారో..... ఏం ట్రీట్‌మెంటో తెలియదు. నర్సులూ హౌస్ సర్జన్లూ మాత్రం గుసగుసల్తో కిలకిలల్తో కాలక్షేపం చేసుకున్నారు.

వాళ్ళ మాటల్లో.... బెడ్‌రూం అనీ..... రికార్డు అనీ.... మాటలు దొర్లినట్లు కొందరు చెప్తారు. సాయంత్రానికి డిశ్చార్జ్ చేసేశారు శంకర్‌ని.

విటమిన్ మాత్రలూ, టానిక్.... మరేం ఫరవాలేదు.... కోలుకున్నట్టే అన్నారు.

ఇరుగు పొరుగు పరామర్శలకి సరిత, శంకర్ ఏ సమాధానమూ చెప్పలేదు.

"ఎంతా? మూడు రోజులు..." చేతి వేళ్ళు లెక్క పెట్టు కుంటూ చెప్పాడు సదాశివం. "హాస్పిటల్‌లో ఉండొచ్చా డంటే ....ఏం కొంప మునిగిందో నని..... నేనూ ఇవాళే... పొద్దున్నే..... ఇందాకే...వాళ్ళింటి కెళ్ళి.... ఇటే వస్తున్నా! పాపం! చాలా డీలా పడి పోయాడు.... కానీ మొహంలో అదో లాంటి గర్వం.... దాగడం లేదు.

"సరిత లేదు. పుట్టింటి కెళ్ళి పోయింది. ఇంక రాదేమో.... డైవోర్స్‌కి వేస్తుం దేమో! అన్నాడు వాడు.... దిగులుగా వున్నాడు, ధీమాగానూ వున్నాడు....

"అంత పనీ చేస్తుందంటావా? కాపుర మన్నాక సవా లక్ష.... వస్తుంటాయి.... పోతుంటాయి కదా?

"అమ్మాయి వైపు వాళ్ళొచ్చి అసలేం ప్రాబ్లెం? అని అడిగితే...ఆరా తీస్తే.... మన వాడి పరువు కాస్తా దెబ్బ తింటుం దేమో! ఆరా తీసే వాళ్ళకి మనం ఎవరు గాని... ఏ మాత్రమూ క్లూ ఇవ్వ కూడదు....

"అసలు ఈ సంగతి కూడా మనం.... ఎవరంటే వాళ్ళకి చెప్ప కూడదు.

మనలో మనం కూడా స్ప్రెడ్ చేసుకో కూడదు..... గప్‌చుప్!!" అంటూ చెప్పడం ఆపాడు.

సదాశివం వంక అనుమానంగా చూశాను. గురుడు అర్థం చేసుకున్నాడు.

"నో... నీకైతే చెప్పాను గానీ... ఇంకెవరికీ చెప్పను. గిన్నిస్ వాళ్ళొచ్చి అడిగినా చెప్పను. ప్రామిస్! ఆలు మగల మధ్య.... ఎన్నయినా ఉంటాయి.... ఏ రికార్డయినా సాధిస్తారు. మన కెందు కసలు....? అర్జంటు పనుంది గానీ వస్తా" అంటూ నింపాదిగా వెళ్ళి పోయాడు.

అదే అనుమానం. మనకెందుకు? అనేవాడికి అంత అర్జెంటు పని ఇంకే ముంటుంది? ఆ మాత్రం తెలీకుంటే.... నేనున్న దెందుకూ?

24.05.1996 సంచిక